www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 29 | మే | 2025
పేజీలు 8

## అశ్రునయనాల నడుమ మదన్‌లాల్ అంత్యక్రియలు




-జనసంద్రమైన ఈర్లపుడి
-పాడేమోసి అభిమానాన్ని చాటుకున్న వద్దిరాజు, పువ్వాడ
-నివాళులర్పించిన మంత్రి తుమ్మల

8లో

### ఆలయ పునర్నిర్మాణం పనులు
# సకాలంలో పూర్తి చేయాలి




-ఆలయ పున : ప్రతిష్ఠ పనులకు శంకుస్థాపన చేసిన భట్టి
-ఆలయం అభివృద్ధి కోసం రూ.4.75 కోట్లు మంజూరు

ప్రజాపక్షం/ముదిగొండ : మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో ఉన్న శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి ఆలయం పునః ప్రతిష్ఠ పనులకు బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఆలయం పునర్నిర్మాణ పనులు అయినా రాజగోపురం, ముఖ మండపం, విశ్రాంతి భవనాల కోసం 4. 75 కోట్ల రూపాయల దేవాదాయ నిధులను భట్టి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాల పాటు ప్రజల ఆరాధ్య దైవంగా కొలిచే ఆలయం పునర్నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను, సదరు కాంట్రాక్టర్ ను ఆదేశించారు. తన ప్రతి ఎన్నికల ప్రచారం తొలుత యడవల్లి శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులు తీసుకొని మొదలు పెడతానని ఆయన అన్నారు. స్వామి వారి ఆశీస్సులు, ప్రజల ఆదరణ తో ఎమ్మెల్యే గా గెలుపొంది డిప్యూటీ సీఎం గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం లో కీలక భూమిక పోషిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల

మిగతా 2లో..

## భారీగా గంజాయి పట్టివేత

-వాహన తనిఖీల్లో 8 క్వింటాళ్ల 30 కేజీలు లభ్యం
-సుమారు రూ.4 కోట్ల 15లక్షల విలువ ఉంటుందని అంచనా
-తొమ్మిది మందిపై కేసు నమోదు
-ప్రెస్ మీట్‌లో వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజ్



ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల పరిధి పడమట నర్సాపురంలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీలో భారీగా నిషేధిత గంజాయి పట్టుబడినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. విశ్వాసనీయ సమాచారం మేరకు సిసిఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీలో హెచ్‌ఆర్ 55ఏ హెచ్ 7375అను ఐసర్ వ్యాన్‌లో నాలుగు కోట్ల పదిహేను లక్షల విలువల గల, 8 క్వింటాళ్ల 30 కేజీల నిషేధిత గంజాయిని పోలీసులు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.
రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులతో పాటు, అమ్మిన,

మిగతా 2లో..

### మహిళా సంఘాల
# ఉత్పత్తులకు డిమాండ్ సృష్టించాలి



-జన సంచారం ఉన్న ప్రదేశాల్లో ఉత్పత్తుల ప్రదర్శించాలి
-ఖమ్మం మహిళా మార్ట్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రణాళికాబద్ధంగా డిమాండ్ సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలో రూ. 30లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన పరికరాలు, వస్తువులు, విక్రయం కూడా వారి ద్వారానే జరగాలని పట్టుదలతో కలెక్టర్ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. దళారులకు లాభం వెళ్లకుండా మహిళా సంఘాలు లాభపడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహిళా మార్ట్‌ను

మిగతా 2లో..

# అధికారులు అభివృద్ధికి తోడ్పడాలి




- యుద్ధ ప్రాతిపదికన అంగన్వాడీ భవనాలు పూర్తి చేయండి
- అంగన్వాడీ అధికారులు రాజకీయాలు చేస్తే సహించేంది లేదు
- వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అధికారులంతా సమన్వయంతో పనిచేసి అన్నివిధాలుగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ఐడిఓసిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా,శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ పనితనాన్ని మెరుగుపరిచేందుకు ఇక్కడ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులంతా సమన్వయంతో పనిచేసినాడే అభివృద్ధి ఫలాలు క్రింది వరకు చేరుతాయన్నారు. నిర్మాణదశలో, ఇంకా మొదలుకాని అంగన్వాడీ భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారి ఆలనాపాలన బాధ్యత సిబ్బందిదే అని, దేశభవిష్యత్ పిల్లల చేతుల్లో, వారి భవిష్యత్ మీ చేతుల్లో ఉందన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి అంగన్వాడీ కేంద్రాలను వాటిల్లోకి మార్చాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఖాళీను భర్తీ చేస్తామని, ఉద్యోగులు,

మిగతా 2లో..

## ఆలయ పునర్నిర్మాణం పనులు

# సకాలంలో పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)





అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని దేవుడు ఆశీర్వాదంతో రుతుపవనాలు ముందస్తుగా వచ్చాయని ఆయన అన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం లో మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పరమితి పది లక్షలకు పెంపు, సన్న బియ్యం సరఫరా, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రాజీవ్ యువ వికాసం, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, రూ.22 వేల కోట్ల తో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం, రూ. 12500 కోట్ల తో ఇందిరా సౌర జల వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. కాగా యడవల్లి శ్రీ యోగానంద లక్ష్మి నరసింహా స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు వచ్చిన భట్టి విక్రమార్క కు పెద్ద ఎత్తున ప్రజలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా హాజరైన భట్టి విక్రమార్క, మల్లు నందిని గార్లకు కార్యకర్తలు ఘజమాల తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కలల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఆర్డీవో నర్సింహారావు, తహశీల్దార్ సునీతా ఎలిజబెత్, ఎంపిడిఓ శ్రీదర్ స్వామి, ఎంపిఓ వాల్మీకి కిషోర్, మండల కాంగ్రెస్ నాయకులు కొమ్మినేని రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీలు బుల్లెట్ బాబు, పసుపులేటి దేవేందర్, కందిమళ్ల వీరబాబు, పల్లపాటి కృష్ణ, మహ్మద్ అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల

# ఉత్పత్తులకు డిమాండ్ సృష్టించాలి





(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరాబాద్‌లోని శిల్పకళారామం వేదికలో అవకాశం కల్పించారన్నారు. అదేవిధంగా ఖమ్మం నగరంలో ప్రయోగాత్మకంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఖమ్మం నగరంలో నలువైపులా ఉన్న నాలుగు మార్కెట్లలో కూడా మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మార్ట్ లాంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ముదిగొండ మహిళలు బ్యాగులు తయారు చేశారని బ్రాండెడ్ షాపుల కంటే చాలా బాగున్నాయన్నారు. మనం తయారు చేసిన వస్తువుకు వ్యాపారం జరగాలంటే అన్ని చోట్ల ప్రదర్శన చేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా చిన్న చిన్న స్టాల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలు ప్రజలు వాడుకునేలా వస్తువులు తయారు చేయాలన్నారు. పిల్లలను లింగ బేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని అప్పుడే మనం పేదరికం నుంచి బయటకు వస్తామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ప్రత్యేకంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్స్, మహిళలకు లాభం కలిగేలా అనేక కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేస్తున్నామన్నారు. ఆరు నెలల క్రితం మంత్రి ఆదేశాల మేరకు మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు వాటి ప్యాకింగ్, మార్కెటింగ్ ఎలా చేయాలి, దళారులు లేకుండా లాభం పూర్తి స్థాయిలో మహిళలకు అందాలని మార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మహిళా సంఘాల్లోని మహిళలకు మార్ట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మంనుంచి వచ్చే ఫలితాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన మున్సిపాలిటీలలో కూడా ఇటువంటి మార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఉత్పత్తి చేసే 20 రకాల వస్తువులు మన జిల్లా బ్రాండింగ్‌తో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వాసులకు మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు ఖమ్మం మహిళా మార్ట్‌లో ఎటువంటి కల్తీ లేకుండా పూర్తి నాణ్యతతో కూడిన పదార్థాలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళా మార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి అక్కడే టీ త్రాగారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాష్ నగర్ 29వ డివిజన్ టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 60 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యతతో పది కాలాల పాటు ఉండేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిఆర్‌డివో సన్యాసయ్య, ఆర్డివో జి. నర్సింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# భారీగా గంజాయి పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేసిన మొత్తం తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ నిషేధిత గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామ రాజు జిల్లా, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోనీ తులసిపాక గ్రామం నుండి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఐసర్ వ్యాన్‌తో పాటు, రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసినట్టు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను సమర్ధవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బి రవి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. యువత ఈజీ మనీకి అలవాటుపడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అధికారులు అభివృద్ధికి తోడ్పడాలి



(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. అంగన్‌వాడీ అధికారులు చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి జీతాలు పొందుతున్న అంగన్వాడీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, స్థానికంగా ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది పనితీరు ప్రభుత్వ ప్రతిష్టను పెంచడంతో పాటు తమ ప్రతిష్టను కూడా పెంచుతుందని తెలిపారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు సరఫరా చేస్తే తిరస్కరించాలని, నాణ్యత లేని ఆహార పదార్థాల ద్వారా పిల్లల్లో పౌష్టికాహారం లోపాలు సంభవించే ప్రమాదం ఉందని, సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల ఆలనా పాలన చూసుకునేందుకు త్వరలో క్రష్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, పైలెట్ ప్రాజెక్టు క్రింది ముందు కొన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. వయో వృద్ధుల సంక్షేమానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అతిత్వరలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోనికి తెస్తామని, వేసవి సెలవుల అనంతరం అంగన్వాడీ కేంద్రాల ప్రారంభం సెల్ఫీ విత్ అంగన్వాడీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆస్తులను తీసుకుని తల్లిదండ్రులను చూడని పిల్లలపై కేసులు నమోదు చేయాలని, ఇందులో ఎంతటి వారినైనా ఉపేక్షించేంది లేదన్నారు. వయోవృద్ధుల కోసం వారి ఆలనాపాలనా చూసుకునేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లను ప్రథమ ప్రాధాన్యత క్రమంగా మంజూరీ చేయాలన్నారు. వ్యవస్థలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజలకు సేవచేసేందుకే ఉన్నారని, ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికీ మేలు జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, వీటి ఫలాలలు క్రిందిస్థాయికి సైతం చేరాలంటే అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించిన నాడే సాధ్యమవుతుందని, ఇందుకోసం కృషి చేసి పిల్లల అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి తోడ్పడాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపి పోరిక బలరామ్ నాయక్, కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి ఎంఎల్‌ఏలు కూనంనేని సాంబశివరావు, డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, లెనినాతోపాటు ఉమ్మడి జిల్లాలోని అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళ మిస్సింగ్

### -పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో షారోన్ చర్చికి ప్రార్ధన కోసం వచ్చిన మట్టే కళ్యాణి వయసు 25 సంవత్సరాలు, ఆమె కూతురు రుతిక వరసు 5 సంవత్సరాలు, కనిపించకపోవడంతో ఆమె తండ్రి మట్టే రాములు వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన మట్టే కళ్యాణికి గత కొన్ని రోజుల నుంచి మానసిక పరిస్థితి బాగోలేక ఖమ్మంలోని మానసిక వైద్యశాలలో, దర్గాల వద్ద చూపించిన తగ్గలేదని దాంతో బుధవారం వైరాలోని షారోన్ చర్చికి ప్రార్ధన చేపిద్దామని తల్లిదండ్రులు తీసుకొని వచ్చారు. చర్చిలో ప్రార్ధనకి హాజరైన కళ్యాణి సాయంత్రం నాలుగు ఒంటల సమయంలో తన కూతురితో బయటికి వెళ్లింది. కొద్దిసేపటికి గమనించిన తల్లిదండ్రులు బయటకు వచ్చి వెతుకులాడగా ఎక్కడ కనిపించలేదు. చర్చి పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు ఆటో ఎక్కి తల్లాడ వైపు వెళ్లిందని చెప్పినట్లు వారు తెలిపారు. కళ్యాణి పింక్ డ్రెస్ బ్లాక్ లెగ్గిన్ దుస్తులు ధరించి ఉంది. వివరాలు తెలిసిన వారు వైరా పోలీసులకు సమాచారం అందించగలరు. వైరా ఏసిపి 8712659146, వైరా సిఐ 8712659147, వైరా ఎస్సై 8712659148 నెంబర్లను సమాచారం అందించాలని వైరా పోలీసులు తెలిపారు.

# కూతురు పుట్టిన ఇల్లు కళకళలాడుతుంది..

**-తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు రావాలి**
**-ప్రతి రంగంలో మహిళలు ముందంజ**
**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కూతురు పుట్టిన ఇల్లు కళకళలాడుతుందని సామాజికంగా తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు వస్తేనే ఆడపిల్లలకు సమానత్వం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆడపిల్ల పుట్టడం అదృష్టమని తెలుపుతూ ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలోని 51వ డివిజన్ ద్వారకా నగర్‌లో బేగం కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందంగా ఇంటిని అలంకరించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం పెరగనిద్దాం, అమ్మాయిలు ఐపిఎస్, ఐఎఎస్, పోలీస్, డాక్టర్, టీచర్, లాయర్, సైంటిస్ట్, పైలెట్ వంటి పలు రంగాల్లో ఉన్నతంగా రాణించాలనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఘన స్వాగతం పలికారు. షాజీదాబేగం, అఖీల్ దంపతులకు 2025 ఫిబ్రవరి 12న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి వారి ఇంటికి వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాప తల్లిదండ్రులతో పాటు నానమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ బంధువులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, నూతన వస్త్రాలు, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. పాపను ఎత్తుకుని రంగు రంగుల పూలతో ముస్తాబు చేసిన ఊయ్యాలలో వేసి పాప చిరునవ్వును చూసి కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్ల ఆవశ్యకత ఎలాంటిదో వివరించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఈ కార్యక్రమంలో ఆడబిడ్డలను ఆశీర్వదించడం చూస్తుంటే సంతృప్తి కలుగుతుందని ఆనందం వెల్లబుచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారని ఆడపిల్లలను బాధ్యతగా పెంచి పోషించి బంగారు భవిష్యత్తును కల్పించాలని కోరారు. ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులు అదృష్టవంతులన్నారు. అమ్మాయిలను మగవారితో సమానంగా విద్య, వైద్యం, న్యాయం, సంరక్షణ, సామాజిక ఎదుగుదలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆడపిల్లలే ఇంటికి మణిదీపాలని ప్రస్తుత అధునీక యుగంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్నారన్నారు. మనం ఆశించే మార్పు మన ఇంటి నుంచే ప్రారంభించాలన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టిన జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి మంచి సందేశం అందించాలని తెలిపారు. మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ మా ఇంటికి కలెక్టర్ వచ్చి మా పాపను ఆశీర్వదించి పాప భవిష్యత్తు గురించి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ చెప్పిన విధంగా పాపను మంచిగా చదివించి ఉన్నత స్థాయిలో ఉండేవిధంగా తీర్చిదిద్దుతామన్నారు. పాప పెరిగిన తర్వాత తమ ఇంటికి కలెక్టరే స్వయంగా వచ్చి పాపను దీవించి వెళ్లారని తెలిపి ఆనాటి మధుర క్షణాలను పంచుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపివో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్విట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన మహానీయుడని , మహిళలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఐటిడిసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, జిల్లా మాజీ బాధ్యులు చుట్టు వెంకటేశ్వర్లు, రూరల్ పార్టీ అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు, కోనేరు రాణి, మేడేపల్లి రాణి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ పిలుపునిచ్చారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని జలగంనగర్‌లో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాను ప్రారంభించారు. అక్కడి నుంచి జాత పల్లెగూడెం, ఎంవీ.పాలెం, కాచిరాజుగూడెం మీదుగా చింతపల్లి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ప్రజలకు అవాగాహణ కలిగిస్తూ ఆయన ప్రసాంగాలు చేశారు. కార్పొరేట్ విధానాలతో తల్లిదండ్రులు నిరుపేదలవుతున్నారే తప్ప ఎటువంటి ఉపయోగం ఉండటం లేదన్నారు. వారి హంగు ఆర్భాటలు, ధనార్జన కోసమే తప్ప విద్యార్థుల భవిష్యత్తు కోసం కాదన్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యతో పాటు తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అభయంగా నిలుస్తాయన్నారు. ప్రభుత్వం బుక్స్, యూనిఫాం, బోజన సదుపాయం, ఇంగ్లీష్ విద్య వంటి సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తుందని తెలిపారు. కావున సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నరసయ్య, కేశ్య, రాంబాబు, సతీష్, చిరంజిత, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థికి ప్రోత్సాహకం అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మెకానిక్ సోదరుల పిల్లలకు ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పదవ తరగతి ఫలితాల్లో మెకానిక్ శెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు శెట్టి లోకేష్ 510 మార్కులు సాధించారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం ట్రాఫిక్ సిఐ సాంబశివరావు చేతుల మీదుగా ఐదువేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేసి సన్మానించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ సోదరుల పిల్లలు పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 27 మంది విద్యార్థులకు రూ. 1.35 లక్షలను యూనియన్ తరుపున అందజేశామన్నారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన మెకానిక్ సోదరులకు యూనియన్ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐని సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు తటుకునూరి బ్రహ్మాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, కోశాధికారి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి దుంపల నాగరాజు, ఉపేందర్, మధు, అన్నదేవర భద్రయ్య, దేవేందర్, హరీష్, పలువురు మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం 2025అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20రోజుల వరకు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు భూమి రికార్డుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటే తప్పనిసరిగా రెవెన్యూ సదస్సులో తమకున్న సమస్యలను అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆయన అన్నారు. సాదా బైనామాలో నమోదు కాని తమ భూమి రికార్డులు భూ భారతి ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. భూ రికార్డులలో పేర్లు లేకుండా పేర్లు నమోదు చేయాలన్న భూమి మీద యజమాని ఉండి పాస్ బుక్‌లను రాకపోయినా అలాంటి ఏ సమస్యలున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆయన అన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తెలుగువారి ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని వాకర్స్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎన్‌టిఆర్ 102వ జయంతి సందర్భంగా వాకర్స్ ప్యారడైజ్ ప్రాంగణంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా పని చేసిన కాలాన్ని స్వర్ణ యుగంగా వక్తలు అభివర్ణించారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దర్శనీకుడు ఎన్‌టిఆర్ అన్నారు. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో మూడు అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఎన్‌టిఆర్ పాలన సాగించారన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు నెల్లూరి రామచంద్రయ్య, విప్పర్ల వాసుదేవరావు, చావా వీరభద్రరావు, యలమద్ది వెంకటేశ్వర్లు, కొల్లు రఘు సత్యనారాయణ, వైద్యులు శివరామకృష్ణ, నాగేశ్వరరావు, మహీదర్, కె. శ్రీరాం, లింగాల రవికుమార్, సాయితేజ చౌదరి, వెంకట్రావు, శ్రీనివాసరావు, నగేష్, శ్రీలత, బిందు, సతీష్, పారుపల్లి రాము, చావా రాము, బాబూరావు, వెంకన్న, రామకృష్ణ, కూరపాటి వెంకటేశ్వర్లు, పలువురు వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/మధిర :** బూత్‌స్థాయిలో బిజెపి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, జిల్లాశక్తి కేంద్ర ప్రముఖ్ మందడపు సుబ్బారావు, సహ ప్రముఖ్ జ్వాలా నర్సింహారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మధిర నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మండలాల్లో ప్రతి బూత్‌స్థాయిలో పటిష్టమైన పార్టీ నిర్మాణం జరగాలని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజల పక్షాన పోరాటం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సూచించారు. ప్రతి మండలంలో శక్తి కేంద్ర ఇంచార్జి ప్రముఖ్‌లను ఏర్పాటు జరగాలని కోరారు. పటిష్టమైన కమిటీలు ఏర్పాటు చేయాలని, స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీమోర్చా కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు, బిజెపి జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వందేళ్లు దాటిన మర్రిచెట్టు తొలగింపు




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా పోలీస్ స్టేషన్ ముందు భాగంలో ఉన్న సుమారు వందేళ్లు పైబడిన మర్రి చెట్టును బుధవారం తొలగించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎంతో మంది ప్రజలు వారి అవసరాలకు ఉన్నతాధికారును కలవాలనుకున్న చెట్టు కింద సేద తీర్చుకునే వారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చెట్టును తొలగించడంతో స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సేద తీర్చుకునే అవకాశం లేకుండా పోయింది. గత అనేక సంవత్సరాలుగా పోలీస్‌స్టేషన్ ముందు భాగంలో రోడ్డు పక్క ఈ భారీ వృక్షం ఉండడం వల్ల ఎండకాలంలో, వాన కాలంలో సైతం ప్రజలు చెట్టు కింద నిలబడి ఉండే వారు. రోడ్డు పనుల నిమిత్తం ఒక్కసారిగా చెట్టు తొలగించడంతో పట్టణమంతా బోసిపోయినట్లు ఉంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్లపై ఉన్న దుకాణాలను తొలగించటం, భవనాలను, చెట్లు తొలగించే పనులు జరుగుతుండటంతో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తలు చోటుచేసుకున్న నేపథ్యంలో పోలీస్ పహారాలో పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీగా ఏర్పడిన తర్వాత చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనుల పూర్తయితే అశ్వారావుపేట పట్టణం నూతన శోభను సంతరించుకోనున్నది.

# తెలుగు జాతి ఆణిముత్యం ఎన్‌టిఆర్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలుగుజాతి ఆణిముత్యం స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. బుధవారం సత్తుపల్లి పట్టణంలో నట విఖ్యాత, మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ స్థాపకులు నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి శాసనసభ్యురాలు డా.మట్టా రాఘమయి దయానంద్ పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగుల సామ్యూల్, విరివాడ నాగభూషణం, షరీఫ్, ఆంగోతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మరో సైబర్ నేరస్తుడు అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సైబర్ నేరస్తుల వలలో పడి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి కోటి అరవై రెండు లక్షల రూపాయల నగదు నష్టపోయిన బోనకల్లు మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చెందిన కేసులో మరో నిందితుడి నలువాల అర్జున్‌ను ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 26 న విజయవాడలో షెక్ సుభాని, దాసరి సునిల్‌కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణలను అరెస్ట్ చేయగా ఇదే కేసులో మరో నిందితుడు అర్జున్‌ను బుధవారం సిద్దిపేటలో అరెస్ట్ చేసి ఖమ్మం తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణిందర్ తెలిపారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను తెలుగుదేశం నాయకులు, అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల టిపిపి పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు. మండలంలోని జమలాపురం, వెంకటాపురం, నారాయణపురం, ఎర్రుపాలెం, రేమిడిచర్ల, అయ్యవారిగూడెం, ఇనగాలి తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచి నందమూరి తారక రామారావు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జమలాపురం ఎస్సీకాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన మహానీయుడని అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు గోసు రామారావు, బండారు అప్పారావు, కృష్ణారావు, జగన్, సత్యనారాయణరెడ్డి, వీరమాచినేని వెంకటకృష్ణారావు, అజ్మీరా వెంకటేశ్వర్లు రాజా, లక్ష్మయ్య, మస్తాన్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మండల కేంద్రంలో షీ రాక్స్ సెంటర్లు

**-మహిళల ఆర్థిక ఉన్నతిని కాంక్షిస్తూ జిరాక్స్ సెంటర్ల కేటాయింపు**
**-షీ రాక్స్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళల ఆర్థిక ఉన్నతిని కాంక్షిస్తూ గార్లపాటి రమాబాయికి మంజూరైన షీ రాక్స్ సెంటర్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ దివ్యాంగులకు ఉపాధి కల్పించేలా షీ రాక్స్ పేరిట ప్రభుత్వ కార్యాలయాల వద్ద కంప్యూటర్లతో కూడిన జిరాక్స్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద షీ రాక్స్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తహసీల్దార్ ఎంపిడివో కార్యాలయాల వద్ద జిరాక్స్ షాపుకు మంచి డిమాండ్ ఉందని దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. సిటీజన్ సర్వీస్ సెంటర్, స్కానింగ్, ల్యామినేషన్ వంటి సౌకర్యాలతో భవిష్యత్తులో విస్తరణకు కూడా అవకాశం ఉంటుందన్నారు. సిటీజన్ సర్వీస్ సెంటర్, జిరాక్స్ షాపులను ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద దివ్యాంగులైన మహిళలకు ప్రతి మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ముందుగా దివ్యాంగులకు కేటాయించి జిరాక్స్ కేంద్రాలు ప్రారంభిస్తామని అనంతరం దశల వారీగా మహిళలకు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో షీ రాక్స్ సెంటర్లను కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట వారి ఆధ్వర్యంలో కొత్తూరు రైతు వేదికలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లగుళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులతో శాస్త్రవేత్తలను మమేకం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టటం నిజంగా అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టి రైతులకు మేలు చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డాక్టర్ జే. హేమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. యూరియా ఇతర ఎరువులను తగిన మోతాదులో వాడటం వలన సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక నికర లాభాలు పొందవచ్చన్నారు. రైతులు పంట మార్పిడి చేయటం, పంట అవశేషాలను భూమిలో కలియదున్నటం వలన భూసారం పెరుగుతుందన్నారు. రైతులు పంటల సాగులో పాటించవలసిన శాస్త్రీయ మెళకువలు గురించి వివరించారు. అనంతరం వ్యవసాయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదులను భద్రపరచుకుని, ఏదైనా సమస్యలు వచ్చినట్టయితే వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని తెలియపరిచారు. సాగునీరు వినియోగంలో పాటించాల్సినటువంటి శాస్త్రీయ మెళకువలను రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాంప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షలకు మట్టి నమూనాను ఏ విధంగా సేకరించాలి, ఏ పోషకాలను పంటలకు ఏం మోతాదులో ఏ విధంగా వాడాలి తెలిపారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం యొక్క ఆవశ్యకతను రైతులకు వివరించారు. పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. రమేష్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో పాటించాల్సినటువంటి మెళకువలు, పంట అవశేషాలను భూమిలో కలియ పెట్టుకోవడం వల్ల కలిగేటువంటి ప్రయోజనాలను గురించి వివరించారు. తరువాత పశు సహాయ సంచాలకులు డాక్టర్ ప్రదీప్, పశు వైద్యులు డాక్టర్ శశిదీప్ మాట్లాడుతూ వ్యవసాయానికి పాడి పరిశ్రమకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. రైతాంగం వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా చేపట్టినట్లయితే అధిక లాభాలను పొందవచ్చన్నారు. వేసవికాలంలో పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులునరేష్, ఆశాజ్యోతి, వాసంతి, వ్యవసాయ కళాశాల విద్యార్థుల తో పాటు కొత్తూరు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో మణుగూరు మెయిన్ రోడ్ నందు గల శ్రీవారి జ్యూయలర్స్ షాపులో ఒక్కరు మాత్రమే ఉండడం గమనించి ఒక వ్యక్తి మాస్క్ వేసుకొని షాపు లోపలికి వెళ్లి షాప్ లో పనిచేస్తున్న ఆమెతో మాటల్లో పెట్టి షాప్‌లో నుండి బంగారు ఆభరణాలు సుమారు 132 గ్రాములు గల బాక్స్ ను దొంగిలించాడు. షాప్ యజమాని దేవతా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై ప్రసాద్, సిసిఎస్ ఎస్సై రామారావులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం సీసీటీవీ పుటేజీ, లాడ్జిలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో 27వ తేదీ మంగళవారం ఎస్సై ప్రసాద్ తన సిబ్బంది రామారావు, కొర్ర బాలు లతో హనుమాన్ టెంపుల్ దగ్గర్లో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి పోలీస్ వారిని చూసి భయపడి పారిపోవుటకు ప్రయత్నించగా అతనిని వెంబడించి, పట్టుకొని విచారించగా తన పేరు గొర్రెల సత్యనారాయణ, గ్రామం ఆకివీడు, భీమవరం జిల్లా ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన వాడని చెప్పి తాను మణుగూరు శ్రీవారి జువెలరీ షాప్ లో చేసిన దొంగతనం ఒప్పుకొని అందులో నుండి తీసిన బంగారం చైన్లు 6 నల్లపూసల గొలుసు 1, బేబీ రింగ్స్ 5, సుమారు 132 గ్రాముల బరువుగలవి తీసి చూపించాడు. అంతేగాక తాను అంతకు ముందు వరంగల్ సాయి గణేష్ జ్యూయలరీ షాపులో దొంగతనం చేసిన చిన్న చిన్న బంగారం చెవి కమ్మలు 20 జతలు, సుమారు 30 గ్రాములు కూడా చూపించాడు. గొర్రెల సత్యనారాయణ సుమారు 35 పైగా రెండు రాష్ట్రాలలో బంగారు షాప్‌లలో దొంగతనం కేసులు నమోదు అవ్వడం జరిగింది. మణుగూరు, వరంగల్ తో పాటు తిరుపతి, కర్నూల్‌లో కూడా దొంగతనాలు చేసినట్టు నేరాలు ఒప్పుకోవడం, బుధవారం నిందితుణ్ణి మణుగూరు కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందని డిఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసు ఛేదించిన ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై ప్రసాద్, సిసిఎస్ ఎస్సై రామారావు, మణుగూరు సిబ్బంది రామారావు, బాలు, సిసిఎస్ సిబ్బంది వెంకట్ నారాయణ, విజయ్ లను మణుగూరు డిఎస్పి అభినందించారు. ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరైనా ఊరు వెళ్తున్నప్పుడు పోలీస్ లకు తెలియజేయాలని, అదే విధంగా ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు లేకుండా చూసుకోవాలని, ప్రజలందరూ వారి ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డిఎస్‌పి సూచించారు.

# ట్రంప్ చెబితే మోడీ యుద్ధాన్ని నిలిపేశారు..

**- సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు**
**- అట్టహాసంగా వరంగల్‌క్రాస్‌రోడ్ సిపిఐశాఖ సమావేశం**
**- 28,29,30 డివిజన్లలో నూతన కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** యుద్ధానికి వ్యతిరేకమని కమ్యూనిస్టులు చెబితే తమన పాకిస్తానీ సపోర్టర్లని చిత్రీకరించి..ట్రంప్ చెబితే మాత్రం ప్రధాని మోడీ యుద్ధాన్ని నిలిపివేసి ద్వంద వైఖరిని ప్రదర్శించాడాని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల మా కాంప్లెక్స్‌లోని పోటు ప్రసాద్, వెంపటి సూర్యనారాయణ మీటింగ్ హాల్లో శాఖ సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత డిబిఆర్ సర్కిల్లోని అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అలాగే పహల్గాం ఉగ్రదాడిలో మృతులతో పాటు ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన సిపిఐ పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు రెండు నిమిషాలు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేందర్, సైదిరెడ్డి, రాజు, యోబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు...బిజెపి పార్టీ మతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజల్లో విద్వేశాలు రెచ్చగొడుతుందన్నారు. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే కాంక్షతో క్రిస్టియన్, ముస్లింలను శత్రువులుగా చిత్రీకరిస్తుండడం ఎంతవరకు సమంజసం అన్నారు. లౌకికి దేశంలో అధికాకాంక్షతో సాగిస్తున్న ఈ ధమనకాండ ఎంతో పెను ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గిరిజన హక్కుల కోసం పోరాటం చేసే నక్సలైట్లను ఆపరేషన్ కగర్ పేరుతో హతమార్చడం సరికాదన్నారు. వారేమి దేశ ద్రోహులు కాదని, వారి కోసమని గొంతెమ్మకొర్కెలు కోరడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎదురుతిరుగుతారనే నక్సలైట్లను ఎరివేస్తున్నారని ఆరోపించారు. సోషలిజంతో సమసమాజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టులు బిజెపి చేస్తున్న మత రాజకీయాలపై ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా 28,29,30 డివిజన్లకు సంబంధించిన సిపిఐ, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, యడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గిరిజన సమాఖ్య నాయకులు పాల్తీయ శ్రీను, యువజన, మహిళా సమాఖ్య సభ్యులు, సిపిఐ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తులో చిత్తవుతున్న యువత, మైనర్లు..!



**ప్రజాపక్షం/మణుగూరు:** మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీస్‌లు, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు ఒక పక్క హెచ్చరికలు జారీ చేస్తున్నా.. దాడులు చేసి ఉక్కు పాదం మోపుతున్నా... మండలంలో మాత్రం గంజాయి గుప్పుమంటుంది. మైనర్లు మత్తు గమ్మత్తులో చిత్తవుతున్నారు. ప్రధానంగా మణుగూరు చేపల మార్కెట్ ఏరియా, పివీ కాలనీ సింగరేణి ఏరియాలలో ఈ మత్తు మందు బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మణుగూరు చేపల మార్కెట్ ఏరియాలో నిత్యం గంజాయి గుప్పు గుప్పు మంటుందని గుర్తు తెలియని యువకులు ప్రతి రోజు పదుల సంఖ్యలో ఏరియాలోకి వస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గాంజా మత్తులో చోరీలకు సైతం పాల్పడుతున్నారని ఇటీవల చేపల మార్కెట్ కు చెందిన కట్ట లక్ష్మీనారాయణమూర్తి ఇంట్లో దొంగలు చొరబడి నగదు తో పాటు నిత్యవసర సరుకులు కూడా చోరీ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. చేపల మార్కెట్ ఏరియాలో కొంత మంది యువకులు ప్లాస్టిక్ కవర్ లో ఏదో రకమైన లిక్విడ్ కలిపి పిలుస్తూ మత్తులో చిత్తవుతున్న దృశ్యాలను తమ కెమెరాలో స్థానికులు చిత్రీకరించారు. గాంజాకి బానిసైన యువత, మైనర్లు హీటెక్స్ గమ్, పంచర్లకు వేసే సొల్యూషన్ గమ్ లు నిషేధం లేకపోవడంతో మార్కెట్లో సులువుగా దొరుకుతుండటంతో ఇవి పిలుస్తూ మత్తులో తేలిపోతున్నారు. ఇవి పీల్చడం వల్ల తీవ్రస్థాయిలో నేరుగా మత్తు తలకెక్కుతుందని, నరాల బలహీనత, కంటి చూపు మందగించడం జీవితం నాశనం అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. పోలీస్ శాఖ దృష్టి సారించి చేపల మార్కెట్ ఏరియాలో నిఘా పెంచి గాంజా పై ఉక్కు పాదం మోపాలని, గాంజా రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

# కొండరెడ్ల సంక్షేమానికి కృషి

**తిరుమలకుంటలో గిరిజనులతో పిఒ ముఖాముఖి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మారుమూల ప్రాంతాల్లో నివసించే కండరెడ్ల గిరిజన కుటుంబాల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట మండలంలోని తిరుమలకుంట గ్రామంలో కొండరెడ్ల గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి మౌళిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ కొండరెడ్ల గిరిజన కుటుంబాల వారికి తప్పని సరిగా పిఎం జన్మన్ పథకంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. సొంతస్థలం ఉన్న వారికి సర్వే నిర్వహిస్తున్నారని, ఈనెల 31వరకు ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. వారం రోజుల్లో ప్రతీ ఒక్కరికి అనుమతిపత్రాలు ఇస్తామని, మూడు మాసాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తామని చెప్పారు. యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసంపథకం ద్వారా రుణాలు అందేలా చూస్తామని, ఇందిరా జలవికాసం పథకం ద్వారా పోడు రైతులు వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. పిల్లలకు తప్పని సరిగా ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు ఇప్పిస్తామని, డిగ్రీ, బిటెక్ చదువుతున్న వారికి ఒక సం. ఫీజు లేదంటే ల్యాబ్‌ట్యాబ్ ఇస్తామని చెప్పారు. బిటెక్ మొదటి సం. చదువుతున్న ధనలక్ష్మి అనే యువతికి సోమవారం ఐటిడిఏలో ల్యాప్‌ట్యాబ్ అందిస్తామన్నారు. జీవనోపాధి పొందెందుకు యువకులు, మహిళకు స్వయం ఉపాధి అవకాశాలను చూపిస్తామన్నారు. గ్రామంలో మంచినీరు, డ్రైనేజీ సమస్య ఉందని గ్రామస్తులు పిఓ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామస్తులు కోరిన విధంగా సర్వే చేయించి పనులు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, ఎంపిడిఓ ప్రవీణ్, జేడిఎం హరికృష్ణ, హౌసింగ్ ఏఇ మదన్, తిరుమలకుంట పంచాయితీ కార్యదర్శి కార్తీక్, పోతిరెడ్డిగూడెం, వినాయకపురం పంచాయితీ కార్యదర్శి సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ద్వితీయ పుత్రుడి వివాహం కరకగూడెం మండలంలో ఇటీవల జరిగింది. బుధవారం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క వారి స్వగృహానికి వెళ్ళి నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు అందించి, నిండు నూరేళ్లు పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తన తోబుట్టుతో సమానమైన నా ఆడపడుచు అని మంత్రి సీతక్క కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కుటుంబ సభ్యులు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

**ప్యాసింజర్ పోగొట్టుకున్న లక్ష రూపాయలను డిపోలో అప్పగించిన మహేష్**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న ఇల్లటూరి మహేష్ మంగళవారం మణుగూరు నుండి అమలాపురం డ్యూటీకి వెళ్లి తిరిగి మణుగూరు డిపో కి బయలుదేరి వస్తున్న క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న అశ్వారావుపేటకు చెందిన ప్యాసింజర్ లక్ష రూపాయలు నగదు ఉన్నటువంటి పర్స్ బస్సులో పడిపోవడంతో, ఈ విషయాన్ని బాధితుడు ఆర్టీసీ అధికారులకు తెలియజేయడంతో మహేష్ బస్సులో తనిఖీ చేయగా దొరికిన పర్స్‌ను గమనించిన డ్రైవర్ మహేష్ దానిలో లక్ష రూపాయలు నగదు ఉండడంతో వాటిని మణుగూరు డిపో సెక్యూరిటీ అధికారులకు అప్పగించాడు. బుధవారం ఉదయం బాధితుడికి పోగొట్టుకున్న లక్ష రూపాయలను తిరిగి ప్యాసింజర్ కు అందజేసిన డ్రైవర్ మహేష్ ని, ప్యాసింజర్, ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అన్న నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ అడా కమిటీ సభ్యులు వాసిరెడ్డి చలపతిరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకునిగా, పేదల పాలిట పెన్నిధిగా, రైతన్నలకు అండగా, కార్మిక సోదరులకు దన్నుగా, అభిమానులకు ఆరాధ్య దైవంగా నిలిచిపోతుంది మీ ఘన చరిత్ర అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు యం. లోకేష్, సీనియర్ నాయకులు ముసునూరి చందర్ రావు, సీనియర్ నాయకులు యం. లాలయ్య, తాత రామారావు, పాలవాది సుధాకర్, మద్దెల భద్రయ్య, ఉప్పలపాటి రాంబాబు, మల్లికార్జున్, దారపనేని హరి, మానుకొండ ఉమాకర్, వేముల లక్ష్మయ్య, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, జి రాము, వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విశ్వవిఖ్యాత, నట సార్వబౌమ నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలను బుధవారం సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.టి.ఆర్ విగ్రహానికి తెలుగుదేశం నాయకులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోట్రూ వెంకట రామారావు, వినుకొండ రమేష్, తిమ్మిడి రాంబాబు, మల్లూరు మోహన్, రాచర్ల చంద్రశేఖర్, రాచర్ల మోహన్ రావు, కొంగల చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# కొండరెడ్లు బాహ్య ప్రపంచంలోకి రావాలి

**- జీవనోపాధిని పెంపొందించుకోవాలి**
**- ఐటిడిఏ పిఓ రాహుల్**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొండరెడ్ల కుటుంబాల వారు జీవనోపాధిని పెంపొందించుకునేందుకు బాహ్యప్రపంచంలోనికి రావాలని, జరిగే వింతలు, విశేషాలు తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట మండలంలో గవర్నర్ దత్తత తీసుకున్న గ్రామమైన గోగులపూడిలో గల కొండరెడ్ల యువతీ యువకులు వెదురుతో తయారు చేసిన వివిధ కళాకృతుల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ వారికి పలు సూచనలు చేశారు. ఐటిడిఏ ద్వారా వెదురు కళాకృతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని, కొనుగోలుదారుల అభిరుచులను అనుగునంగా పలు రకాల డిజైన్లు తయారు చేసి సరసమైన ధరలకు విక్రయించుకుని వ్యాపారాన్ని విస్తరించుకోవాలన్నారు. అదేవిధంగా సువాసన వచ్చే ఆగరు బత్తీలను తయారు చేసి అమ్మడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చున్నారు. నిరుద్యోగ యువతీ యువకులు తేనెటీగల పెంపకం, సెల్‌ఫోన్ రిపేర్, సోలార్ ప్యానల్ రిపేర్, స్వయం ఉపాధికి సంబంధించిన శిక్షణలు ఐటిడిఏ ద్వారా అందిస్తామని, ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని పెంపొందించు కోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న యువకులకు తప్పని సరిగా రుణాలు వచ్చేలా ప్రయత్నిస్తామని, పోడు పట్టాలు గల కొండరెడ్డి గిరిజన 26 కుటుంబాల రైతులు ఉన్నందున ఇందిరా సౌరజలవికాసం ద్వారా బోర్లు వేయించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా స్పింక్లర్లు, పైపులు అందించి సాగుకు ఆయిల్ ఫాం, మునగ మొక్కలు, అంతర్పంటలకై కూరగాయలు, పండ్ల మొక్కలు అందిస్తామన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి రైతులు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. సొంత ఇండ్లు లేని కొండరెడ్ల కురుంటబాలకు పిఎం జన్మని పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు. అనంతరం తెలంగాణ గవర్నర్ దత్తతు తీసుకున్న గ్రామాల నిధుల నుండి రూ.5 లక్షల విలువుగల టెంట్‌హౌస్ , మైక్‌సెట్ యువకులకు అందజేశారు. వెదురుతో వివిధ రకాల కళాకృతులు, ఆగరుబత్తి తయారీలో శిక్షణ పొందిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గుబ్బలమంగమ్మ దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, జేడిఎం హరికృష్ణ, ఎంపిడిఓ ప్రవీణ్, ఎంపిఓ సీతారామరాజు, ఐటిడిఏ డిఇ బాపనయ్య, పంచాయితీ కార్యదర్శి మోతిలాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గుబ్బల మంగమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఐటిడిఏ పిఓ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అశ్వారావుపేట మండలంలోని గుబ్బలమంగమ్మ ఆలయాన్ని ఐటిడిఏ పిఓ బి రాహుల్ బుధవారం దర్శించుకునిగిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పూజలు,ముడుపులు కట్టే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన గుడిలోని దేవతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు ఆలయ విశిష్టతను, దేవతమూర్తి గొప్పతనాన్ని, మహిమను ఆయనకు వివరించారు. గిరిజనుల ఇలవేల్పు ఆయిన గుబ్బల మంగమ్మ ఆలయంలో పూజలు చేయగం ఆనందంగా ఉందంటూ పిఓ చెప్పారు.

# తల్లాడ నూతన ఎస్సైగా ఎస్.వెంకటకృష్ణ




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల పోలీసస్టేషన్‌కు నూతన ఎస్సైగా ఖమ్మం సిసిఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్.వెంకట కృష్ణను నియమిస్తూ ఖమ్మం సిపి సునీల్‌దత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం తల్లాడ ఎస్సైగా ఎన్.వెంకటకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై బి.కొండలరావు సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడి నుండి ఖమ్మం త్రిటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ తల్లాడ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

# ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలుగు ప్రజల ఆరాధ్యదైవం మహానీయుడు నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు ప్రతిఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్త కృషి చేయాలని టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు పులుగుజ్జు జగదీష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేవని గుర్తు చేశారు. పేద ప్రజలకు పట్టెడన్నం కోసం ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ సైదులు, పులుగుజ్జు వీరయ్య, పూజల సహదేవ, పూజల వెంకన్న, బండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తింపు

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు : తహశీల్దార్ రాంప్రసాద్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం రెవిన్యూలోని సర్వే నెంబర్ 87లో ఉన్న ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఆధ్వర్యంలో బుధవారం హద్దులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తహశీల్దార్ రాంప్రసాద్ స్వయంగా ఫీల్డ్‌పై సర్వేయర్‌తో హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. కాగా పక్కన వెంచర్లవారు ఫ్లాట్ రాళ్లను ఏర్పాటు చేసుకోగా వాటిని తొలగించారు. అలాగే 8చోట్ల పాయింట్ రాళ్లతో పాటు, ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేపించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడారు..రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్యక్రాంతం కాకుండా స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు సైతం పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. ఖమ్మంరూరల్ మండలంలో పూర్తి స్థాయి సర్వేను చేసి ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనపరుచుకోవడంతో పాటు ఆక్రమణలు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 12,13 వార్డుల్లో డ్రైనేజీ సమస్యలపై మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజీలు ఉన్న సిల్ట్ తొలగించడం ప్రారంభించారు. అదేవిధంగా డ్రైన్‌లు ఆక్రమించుకున్న వాటిని కూడా తొలగించారు. ఈ సందర్భంగా కమీషనర్ చింతా వేణు మాట్లాడుతూ డ్రైన్‌లను ఎవరు ఆక్రమించవద్దని, ఆక్రమించడం వలన నీరు పోకుండా నిల్వ ఉండటంతో డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి ఎక్కడం జరుగుతుందని ప్రజలు దీనికి సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ ప్రారంభం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత కారాయిగూడెం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా పచ్చి రొట్ట విత్తనాలు బుధవారం పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట విత్తనాలు వినియోగించి భూసారాన్ని కాపాడుకొని పంటల సాగులో అధిక దిగుబడి సాధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తుందని ఈ అవకాశంను రైతులు సద్వినియోగం చేసుకుని వారి భూమి సారవంతం చేసుకోవాలని వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు కోరారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కారాయిగూడెం అధ్యక్షుడు చింత నిప్పు సత్యం, మండల పెద్దలు పంది వెంకటేశ్వర రావు, చీకటి రామారావు, వంకాయలపాటి వెంకటేశ్వర రావు, స్థానిక వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్. ఎస్. వి. సమంత, హర్ష నందిని, సి. బుచ్చిబాబు,స్థానికరైతులు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్‌లో ఎన్‌సిసి సైనిక శిక్షణ






**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ సీనియర్ సెకండరీ స్కూల్ నందు ఈ నెల21 నుండి 30 వరకు జరుగుతున్న ఎన్‌సిసి శిక్షణ శిబిరంలో భాగంగా ఎన్‌సిఇస కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె.భద్ర, ఏవో కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా 8వ రోజున యుద్ధ సమయంలో శత్రువులపై ఎలా దాడి చేయాలి. ఎలాంటి సిగ్నల్స్ ద్వారా శత్రువులను ఎలా మట్టుపెట్టాలి వంటి విషయాలని నేర్పిస్తూ ఏఏ సమయాంల్లో ఏ రకమైన ఆయుధ సామాగ్రిని ఉపయోగించాలని, ఎన్‌సిసి కాడెట్స్‌కు శిక్షణ ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా వైరాలోని వైష్ణవి పాల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. స్వచ్ఛభారత్‌లో భాగంగా న్యూలిటిల్ ఫ్లవర్ కాంపస్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళుతూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం, యోగా తరగతులు నిర్వహించారు. అంతేకాకుండా ప్రతిరోజు రెండు గంటలు బుద్ధి వికాస కార్యక్రమాలు జరుగుతాయని అందులో దేశ రక్షణ విధానాలు భారత చరిత్ర ఎన్‌సిసి స్థాపన లక్ష్యాలు, సాంఘిక జీవన విధానం, స్వచ్ఛభారత్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం జరుగుతుందని వివరించి కాడెట్‌లలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఏఎన్‌వో థర్డ్ ఆఫీసర్ సిహెచ్.అపురూపాదేవి పాల్గొన్నారు.

# కళ్యాణ్‌కు నివాళులర్పించిన ఏఐటీయూసీ నేతలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్ పార్శపు కళ్యాణ్ కు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులుతో కలిసి ఏఐటియూసి నాయకులు బుధవారం నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కళ్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ చిన్న వయస్సులో కళ్యాణ్ మృతి చెందటం బాదాకరమని, ఎప్పుడూ చలాకీగా ఉంటూ యూనియన్ యాక్టివిటిస్ లో పాల్గొంటూ, అందరిని కలుపుకుపోయో కళ్యాణ్ మృతి విచారకరమన్నారు. కళ్యాణ్ కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపం, సానుభూతిని తెలియజేశారు. అనంతరం కళ్యాణ్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళ్ళులర్పించిన వారిలో ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా నాయకులు ఎంగల ఆనందరావు, తడికమళ్ళ యోబు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మి, యశోద, పూర్ణ, కంటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ నాన్నలకు సన్మానం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లకు జన్మనిచ్చిన మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన పాప అమ్మ నాన్నలను బుధవారం సిడిపిఓ మొహరున్నీసాబేగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాప మాతృమూర్తి ఎస్.కే ఆశను అభినందించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సునీల్ రెడ్డి, తహశీల్దార్ సత్యనారాయణ, శివ కుమార్, హరి ప్రసాద్, సూపర్ వైజర్లు రమాదేవి, గంగాజలం, వసంత, రాణి, ఏఎన్ఎం కే మంజుల, హెచ్ పి అనిత, అంగన్ వాడీ టీచర్లు నగీనా, రాజ్యలక్ష్మి, ల, సంధ్యారాణి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటలు సాగు చేయాలి

-రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
-పంటల మార్పిడి విధానంతో నష్టాలను తగ్గించవచ్చు
-ఆయిల్ పామ్ ను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటను రైతులు సాగు చేయాలని, పంట మార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చునని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో పర్యటించారు. బల్లేపల్లిలోని కుర్రా మహేష్‌కు చెందిన ఆయిల్ పామ్ పంటను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పామాయిల్ పంటను సాగు చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది, పంట సాగుకు ఎలాంటి జాగ్రత్త చర్యలు పాటించాలి, ఈ పంటలపైన సంతృప్తిగాఉందా, దిగుబడి మంచిగా వస్తుందా, ఇతర రైతులకు ఆయిల్ పామ్ పంటలు వేసుకునేలా ప్రోత్సహిస్తారా అంటూ మహేష్‌తో కలెక్టర్ సంభాషించారు. ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేశానని నాలుగేళ్లలో ఎకరానికి నాలుగు టన్నుల చొప్పున పంట దిగుబడి వచ్చిందని గిట్టుబాటు ధర మంచిగా ఉందని తక్కువ కూలీలు, సాగులో అవసరం ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ తోటను రైతులతో కలిసి తిరిగి అంతర పంటలు ఇతర సమస్యలపై పొలం గట్టు వద్ద రైతులతో కూర్చుని కలెక్టర్ ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లాభదాయక ఆయిల్ పామ్ పంటను అధిక సంఖ్యలో రైతులు సాగు చేయాలని ఆ దిశగా జిల్లా యంత్రాంగం చిత్త శుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు వల్ల లాభాలు ఉంటాయని అంతర పంటల ద్వారా మొదటి మూడేళ్లు ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్ దిగుబడి ప్రారంభమైన తర్వాత ఏడాదికి లక్ష తగ్గకుండా రైతులకు ఆదాయం సంపాదిస్తారన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసేందుకు ప్రభుత్వం మొక్కల సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాల కల్పనకు రాయితీ, అంతర పంటల పెట్టుబడులకు కొంత మేర రాయితీ అందిస్తుందన్నారు. గోద్రెజ్ అగ్రోవేట్ లిమిటెడ్ ద్వారా ఆయిల్ పామ్ పంట 100 ఎకరాల్లో క్లస్టర్ ఉంటే రైతులకు లాభమయ్యేవిధంగా రైతుల వద్ద కొనుగోలు చర్యలు చేపడతామన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వేసిన పంటల వల్ల రైతులు నష్టపోతున్నారని ఏ పంటలు పండించారనే అంశంపై విస్తృతంగా చర్చించాలన్నారు. పంటల మార్పిడిపై అవసరమైన సహాయ సహకరాలు జిల్లా అధికారులు అందిస్తారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. నూతన సాగు పద్దతిలో మొదట పెద్ద రైతుల ద్వారా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎంవి మధుసూదన్, హెచ్‌వో నగేష్, వ్యవసాయ శాఖ ఏడి కొంగర వెంకటేశ్వరరావు, ఏవో కిషోర్‌బాబు, గోద్రెజ్ కంపెనీ మేనేజర్ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నూతన సొసైటీ గోడౌన్‌కు శంకుస్థాపన

-భూమి పూజ చేసిన బత్తినేని దంపతులు





**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార పరపతి సంఘం నూతన గోడౌన్ బత్తినేని దంపతులు నాగప్రసాదరావు, నీరజలు భూమి పూజ, శంఖుస్థాపన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. సోసైటీ అధ్యక్షునిగా బత్తినేని నాగప్రసాదరావు ఎన్నిక అనంతరం సోసైటీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుంది. ప్రధాన రహదారి నుంచి రూ. 1 లక్ష వ్యయంతో సొంత ఖర్చుతో సోసైటీకి సిమెంట్ రోడ్డును, మౌళిక వసతులను ఏర్పాటు చేశారు. గౌడౌన్ నిర్మాణం కోసం ఆయన సొంత నిధులు రూ.30 లక్షలతో 30 కుంటల భూమిని కొని సంఘానికి తానే స్వంతంగా రిజిస్ట్రేషన్ చేయించి అందజేశారు. 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల సోసైటీ కార్యాలయం, గోడౌన్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి అందులో భాగంగానే పనుల ప్రారంభించారు. సంఘానికి ఉన్న విశిష్టత దృష్ట్యా గోడౌన్ నిర్మాణానికి డిసిసిబి ఇస్తున్న రుణంలో రూ.30లక్షలు రాయితీ సమకూరుస్తుండటం విశేషం. జిల్లాలో అంత రాయితీ పొందిన ఏకైక సహకార సంఘమిదే. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, యంగల ఆనందరావు, సీఈఓ దేవవరపు వెంకటేశ్వర్లు, సోసైటీ మాజీ అధ్యక్షులు కాకాని హనుమంతరావు, సోసైటీ డైరక్టర్లు మన్నేపల్లి వెంకటేశ్వరరావు, పోతినేని నరసింహారావు, సోసైటీ సిఈఓ మాదవరపు వెంకటేశ్వర్లు, మాజీ సిఈఓ యనమద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తెలిపిన నాయకులు



**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఎఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం నాయకులు ఇల్లెందు ఏరియాలోని కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తెలిపారు. స్థానిక ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన నెలవారి జీఎం స్థాయి సమావేశంలో గుర్తింపుసంఘం శాఖాకార్యదర్శి మహమ్మద్ నజీర్ అహ్మద్ యాజమాన్యంతో మాట్లాడారు. కేఓసీలో యాక్టింగ్ చేస్తున్న ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ పదోన్నతులివ్వాలని, కేఓసీ ఫిట్1ఏరియాలో కార్మికుల సౌకర్యార్థం వాహనాలకు షెడ్ ఏర్పాటు, ఫిట్టర్‌గది, ల్యాంపు గదిపై రేకులు మార్చాలని, రీడిప్లాయ్‌మెంట్, బదిలీలపై వివరణ ఇవ్వాలని తెలిపారు. 24సివిల్ ఏరియా రిజర్వాయర్ చుట్టూ కంచె ఏర్పాటు, మరుగుదొడ్లు నిర్మాణం, బోర్‌వెల్స్ వద్ద పంపు ఆపరేటర్లు ప్రస్తుతం సబ్‌స్టేషన్ నందు ఉంటున్నారని వారికి ప్రత్యేక గది ఏర్పాటు చేసి లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని ఏరియా జీఎంకు విన్నవించారు. ఏరియా పరిధిలో అన్నిగనుల్లో, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళాఉద్యోగులకు క్రిచ్, డ్రెస్సింగ్‌గదులు, టూల్‌బాక్సులు ఏర్పాటు చేయాలని పలు సమస్యలను ఏరియా యాజమాన్యాలకు విన్నవించగా వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎఐటీయూసీ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, క్లర్క్ స్టాఫ్ ఇంఛార్జీ ఎస్.కె.ముస్తఫా, బొల్లెద్దుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు, మాజీ వైరా నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతి రావు, సురేందర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. మందలపూడి మధుసూదన్‌రావు, కాంతారావు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా నిర్వహించి ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైరా మండల అధ్యక్షులు కిలారు సురేందర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ తెలుగు ఆత్మ గౌరవం పట్ల తెలుగుజాతి ప్రపంచ కుటుంబంలో సృష్టించిన మహానీయుడు తెలుగుదేశం పార్టీ ఎన్నటికి నిలిచి ఉండేవిధంగా చేశారన్నారు. చెరుకూరి చలపతిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎన్‌డిఏ తెలంగాణలో పాగా వేస్తుందని, అధికారం వస్తుందని, కావున వచ్చే ఎన్నికల్లో మన సొంతం అవుతాయని ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండి పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి గుండ్ల నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు పత్తిపాటి సురేష్, స్రవంతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నకిలీ విత్తనాలు అరికట్టాలి

**ప్రజాపక్షం/వైరా:** మార్కెట్‌లో, గ్రామాల్లో మధ్య దళారులు నకిలీ విత్తనాలు రైతులను నమ్మించి అమ్మే ప్రయత్నం చేస్తే వారిని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు కఠినంగా శిక్షించాలని, నకిలీ విత్తనాలు అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం వైరా డివిజన్ కార్యాలయం బోడేపూడి భవనంలో పార్టీ జిల్లా పార్టీ కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వైరా కేంద్రంగా, అదేవిధంగా నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో నకిలీ విత్తనాల బెడదతో గతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు సబ్సిడీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు అన్ని గ్రామాలు, ప్రాంతాల్లో పర్యవేక్షణ చేసి నకిలీ విత్తనాలు రైతులకు చేరకుండా మధ్య దళారులను గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. కాబట్టి నాలుగు ఎకరాల పైబడిన రైతులకు రుణమాఫీ డబ్బులు వెంటనే అందించాలని కోరారు. మే30వ తేదీన ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లుల సమస్యపై కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు ఉపాధి కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈస మావేశంలో సిపిఎం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, వైరా రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు తోటనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని మూడు పాడి గేదెలు మృతి

**రూ. 2.50 లక్షలు నష్టం**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** లారీ ఢీ కొట్టడంతో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామం గోదా తిరుపతిరావు రైతుకు చెందిన మూడు పాడి గేదెలను బుధవారం తెల్లవారుజామున మేతకని బయలుదేరాయి. పెనుబల్లి వద్ద జాతీయ రహదారిపై దాటుతున్న గేదెలను వియం. బంజర వైపు కంకర లోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో గేదెలు మృతి చెందాయి. కుటుంబ పోషణ, జీవనాధారమైన పాడి పశువులు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లందని బాధితుడు వాపోయాడు. ఘటన స్థలంలో పెనుబల్లి పశు వైద్యులు మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. జీవ నాధారం కోల్పోయి విచారణ వ్యక్తం చేస్తున్న బాధిత పాడి రైతు గోదా తిరుపతిరావు కుటుం బానికి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానిక గ్రామస్తులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి కల్పించండి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 20 ఏళ్ల సర్వీస్ నిండిన అంగన్ వాడీ టీచర్లకు సూపర్వైజర్లుగా పదోన్నతి కల్పించాలని సత్తుపల్లి శాసన సభ్యులు డా.మట్టా రాగమయి దయానంద్ కోరారు. స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క అధ్యక్షతన బుధవారం కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రెండు జిల్లాల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలోని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, చిన్నారులకు వచ్చే పౌష్టికాహారం బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. టీచర్లు, ఆయాలకు ప్రతినెల ఒకటవ తేదీన ఖాతాల్లో వేతనం జమ చేస్తున్నందుకు అంగన్వాడీ టీచర్ల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా వేసవి సెలవులు కల్పించినందుకు కూడా ఆమె ధన్యవాదాలు తెలిపారు. టీచర్, ఆయా ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

**పంట పొలాలకు రోడ్లు ఇవ్వండి..**

పంచాయతీరాజ్ శాఖ నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు గ్రావెల్, మెటల్ రోడ్లు మంజూరు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సిఆర్ఆర్ స్కీం కింద నిర్మించిన 25 బీటీ రోడ్లకు రూ.25 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఈ అంశం ఈఎన్సీలో పెండింగ్ ఉందని పరిశీలించి మంజూరు చేయించగలరని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించిన రూ.20 కోట్ల విలువ చేసే పనులకు శాంక్షన్ ఇవ్వాలని చేశారు.

# ప్రభుత్వ వైద్యశాలలో కలెక్టర్ సతీమణి పురుడు పోసుకోవడం అభినందనీయం




**-కలెక్టర్‌ను అభినందించిన ఎంఎల్‌ఏ కూనంనేని**
**- ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేశారు**
**- కార్పోరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలు**
**- సకల సౌకర్యాలతో ఆస్పత్రిని తీర్చిదిద్దుతున్నాం**
**- నవజాత శిశువుకు దీవెనలు అందించిన ఎంఎల్‌ఏ**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి పురుడుపోసుకోవడం అభినందనీయమని, వీరి తీరు ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేసిందని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశిరావు అన్నారు. ఈ మేరకు కలెక్టర్ దంపతులకు శుభా కాంక్షలు తెలిపిన ఆయన నవజాత శిశువుకు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యం పై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ప్రభుత్వ వైద్యశాలలో పురుడుపోసుకోవడం అభినందనీయం అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో కార్పోరేట్ స్థాయి వైద్యం అందించడానికి సకల సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ అస్పత్రిలో మోకాలు చికిత్సలు, కవలల జననాలు అనేకం జరిగాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు కృషి చేస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించి పేద ప్రజల మెప్పుపొందే విధంగా మంచి సేవలు అందించాలని సూచిస్తూ డిసిహెచ్‌ఎస్ డా.రవిబాబును ప్రత్యేకంగా అభినందించారు.

# ఎట్టకేలకు స్పందించిన అధికారులు





మేమేమి చేశాం నేరం..
మాకెందుకీ శాపం..!

**- డబుల్ బెడ్‌రూం సముదాయాన్ని పరిశుభ్రం చేసిన అధికారులు**

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. దశాబ్ద కాలం క్రితం పనులు ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయ పరిసరాలను శుభ్రం చేశారు. నేలకొండపల్లి మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో 30 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని ప్రారంభించారు. కొన్నింటికి శ్లాబ్ వేయగా మరికొన్ని శ్లాబ్ దశలో ఉన్నాయి. ఏమి జరిగిందో కానీ పదేళ్ల నుంచి వాటిని పట్టించుకోలేదు. ఈనెల 12న మేము ఏమి చేశాం పాపం మాకెందుకి శాపం అనే పేరుతో కథనాన్ని 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్లను నిర్మించారు. ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు వెంటనే పనులు పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని గువ్వలగూడెం ప్రజలు కోరుకుంటున్నారు.

# అశ్రునయనాల నడుమ మదన్‌లాల్ అంత్యక్రియలు







**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గుండెపోటుతో మంగళవారం మరణించిన మాజీ శాసన సభ్యులు, వైరా నియోజక వర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి బానోత్ మదన్‌లాల్ అంత్యక్రియలు బుధవారం వేలాది జనం అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఖమ్మంలోని ఆయన స్వగృహం నుంచి స్వగ్రామమైన రఘునాథపాలెం మండలంలోని ఈర్లపుడికి మృతదేహాన్ని తరలించారు. దారి పొడవునా ప్రజలు మదన్‌లాల్‌కు నివాళులర్పించారు. ఖమ్మంజిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈర్లపుడికి చేరుకున్నారు. ఈర్లపుడి జనసంద్రమైంది. మృతదేహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో ప్రజలను నిలువరించడం ఓ దశలో పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో గిరిజనులు మదన్‌లాల్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఈర్లపుడికి చేరుకున్నారు. మదన్‌లాల్ మృతదేహంపై రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, పలువురు బిఆర్‌ఎస్ నాయకులు బిఆర్‌ఎస్ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. అంతిమ యాత్ర ప్రారంభం కాగానే రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పువ్వాడ అజయ్ కుమార్ మదన్‌లాల్ పాడే మోసి మదన్‌లాల్ పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బిఆర్‌ఎస్ నాయకులు, శాసన సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి, రాకేష్‌రెడ్డి, కూరాకుల నాగభూషణం, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, పలువురు మాజీ శాసన సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మదన్‌లాల్ తనయుడు మృగేందర్‌లాల్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు.

### తుమ్మల నివాళి...

మాజీ శాసన సభ్యులు బానోత్ మదన్‌లాల్ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఈర్లపుడి గ్రామంలో వారి స్వగ్రామంలో ఉంచిన మదన్‌లాల్ భౌతికాయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మదన్‌లాల్‌తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఓ గొప్ప నాయకున్ని కోల్పోయామని మంత్రి తెలిపారు.

# నేడు ముగ్గురు మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో నేడు ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌లో జరిగే ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానాకాలం సాగుకు సంబంధించి నిర్వహించే సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లతో పాటు ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి లు తదితరులు పాల్గొంటారు.

# కండక్టర్ల నియామక ప్రచారం నమ్మొద్దు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజియన్ పరిధిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామక ప్రచారాన్ని నమ్మవద్దని రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అవుట్‌సోర్సింగ్ పద్దతుల్లో కండక్టర్లను నియమించడం జరగడం లేదని ఇవి పూర్తిగా తప్పుడు ప్రకటనలని ప్రజలు వీటిని నమ్మవద్దని సూచించారు.

# సిపిఐ మణుగూరు పట్టణ, మండల ముఖ్యుల సమావేశం

**ప్రజాపక్షం/మణుగూరు:** సిపిఐ మణుగూరు పట్టణ, మండల ముఖ్యుల సమావేశం సిపిఐ పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సొందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, గౌరవ అధ్యక్షులు తోట రమేష్, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, బోశెట్టి సంపత్, కనితి సత్యనారాయణ, కొత్తపల్లి సీతారాములు, రావుల రాములు, వేర్పుల నరేష్, బొజ్జ సదానందం, దండుగుల బాబు, ఐతన బోయిన వెంకన్న, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం. 82పై అనుమానాలను నివృత్తి చేయండి

**-25 శాతం ఖాళీలను ఫ్యాక్స్ ఉద్యోగులతో భర్తీ చేయాలి**
**-ఏఐసిబిఎఫ్ కార్యదర్శి కెవిఎస్ రవికుమార్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** జీవో నెం. 82పై అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియను చేపట్టాలని ఏఐసిబిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెవిఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. డిసిసిబి ఖాళీల్లో 25 శాతం ఫ్యాక్స్ ఉద్యోగులతో భర్తీ చేయాలని ఆయన కోరారు. తెలంగాణ ఫ్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం బుధవారం డిసిసిబి కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షులు ఎం. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కెవిఎస్ రవికుమార్ మాట్లాడుతూ జీవో నెం. 44ను సవరిస్తూ తీసుకువచ్చిన జీవో నెం. 82పై పలు అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హడావుడిగా అమలు చేస్తే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. సీనియారిటీ ఆధారంగా ఐబిపిఎస్ పరీక్షలు లేకుండానే ఫ్యాక్స్ ఉద్యోగులతో ఖాళీలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సహకార సంఘాల్లో 2019 తర్వాత చేరి ఉద్యోగులుగా కొనసాగుతున్న వారికి జీవో నెం. 44ను అమలు చేయడం ఎంతో అవసరమన్నారు. సహకార సంఘాల్లో ఖాళీగాఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని రవికుమార్ కోరారు. పిఏసిఎస్ లలో పనిచేస్తున్న సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ ఇన్సూరెన్స్ లను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలన్నారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగల సమస్యలను చర్చించి దశల వారీ ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఫ్యాక్స్ ఎంప్లాయిస్‌యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి విప్పా శ్రీనివాసరావు, రఘురాం, మోటపోతుల రామకృష్ణ, సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక...

తెలంగాణ రాష్ట్ర ఫ్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం. శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి బొంత వీరబాబు, ఉపాధ్యక్షులు నలజాల రాంబాబు, ఉండేటి దాసు, కోశాధికారిగా వనమా మల్లికార్జున్, మహిళా ప్రతినిధులుగా మిరియాల నాగలక్ష్మి , కొమ్ము వెంకటరమణ ఎన్నికయ్యారు.